క్లుప్తంగా

రేపు మండల సమావేశం

కుందుర్పి: స్థానిక మండల పరిషత్ కార్యాయలంలో మండల సర్వసభ్య సమావేశం మంగళవారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నారాయణస్వామి, ఎంపీపీ కమలమ్మ ఆదివారం తెలిపారు. కార్యక్రమానికి సర్పంచులు, ప్రాదేశిక సభ్యులు, అధికారులు హాజరు కావాలని వారు సూచించారు.

శుభకార్యం

వజ్రకరూరు: స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో ఆదివారం వైస్ ఎంపీపీ సుశీలారాణి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్‌రెడ్డి కుమారుడు శశాంక్‌రెడ్డి, నాగలక్ష్మి వివాహ వేడుకలకు ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి దంపతులు, గుంతకల్లు ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి వై.మధుసూదన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్రకార్యదర్శి వై.ప్రణయ్‌కుమార్‌రెడ్డి తదితరులు హాజరయ్యారు. ప్రజాప్రతినిధులు, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు హాజరై వధూవరులను ఆశీర్వదించారు.

వైఎస్సార్‌సీపీ నేత ఉపేంద్రరెడ్డికి మాతృవియోగం


గౌని జయమ్మ

రాయదుర్గంటౌన్: వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు గౌని ఉపేంద్రరెడ్డి తల్లి గౌని జయమ్మ(86) ఆదివారం తెల్లవారుజామున పట్టణంలోని స్వగృహంలో తుది శ్వాస విడిచారు. జయమ్మకు నలుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈమె అంత్యక్రియలు సోమవారం ఉదయం 11 గంటలకు స్వగ్రామమైన పల్లేపల్లిలో నిర్వహించనున్నట్లు బంధువులు తెలిపారు. విషయం తెలుసుకున్న పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఆమె మృతదేహానికి నివాళులర్పించి, సంతాపం తెలిపారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

బ్రహ్మసముద్రం: మండల ంలోని వేపులపర్తిలో చేంజ్ ఫర్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం నంద్యాల శాంతిరాం కంటి ఆస్పత్రి ఆధ్వర్యం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దాదాపు 300 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, 86 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. వారికి వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం కింద కంటి ఆపరేషన్లు చేయిస్తామని సొసైటీ సభ్యులు తెలిపారు. మరో ముగ్గురిని గుండె ఆపరేషన కోసం శాంతిరాం ఆస్పత్రికి రెఫర్ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బసవరాజు, ఈశ్వరప్ప, గౌని ప్రభాకర్ రెడ్డి, చాకలి చెన్నమల్లి, శరణప్ప, కంభాల తిమ్మారెడ్డి, షేక్ జబీవుల్లా, బీరేష్, దివాకర్, మంజు తదితరులు పాల్గొన్నారు.

పశుగ్రాసం దగ్ధం

బొమ్మనహాళ్: మండల కేంద్రంలో ఆదివారం పశుగ్రాసం వాములు దగ్ధమయ్యాయి. బొమ్మనహాళ్‌కు చెందిన రైతు కురుబ రుషేంద్రబాబు 30 ఎకరాలకు చెందిన వరిగడ్డి, వేరుశనగ పొట్టును దొడ్డిలో నిలువఉంచాడు. గడ్డి వాములపై ఉన్న విద్యుత్ తీగలు షార్ట్‌సర్క్యూట్ అయి మంటలు వ్యాపించడంతో.. పశుగ్రాసం అగ్నికి ఆహుతైంది. రాయదుర్గం అగ్నిమాపక సిబ్బంది మంటలు ఆర్పే ప్రయత్నం చేసినప్పటికీ ప్రయోజనం లేకపోయింది. రూ. 2 లక్షల వరకూ నష్టం కలిగినట్లు బాధితుడు వాపోయాడు. సంఘటన స్థలాన్ని వీఆర్‌ఓ పర్వీన్‌బాను పరిశీలించారు. బాధిత రైతును అధికారులు ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

ఇసుక అక్రమంగా తరలిస్తే కేసులు

గుమ్మఘట్ట: అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే కేసులు నమోదు చేసి కటకటాలకు పంపిస్తామని ఎస్‌ఐ సునీత హెచ్చరించారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఆమె ఆదివారం మాట్లాడారు. కర్ణాటక నుంచి ఎవరైనా అక్రమంగా మద్యం, నిషేధిత గుట్కాను తరలించినా, విక్రయించినా కేసులు నమోదు చేస్తామన్నారు. చట్టవ్యతిరేక పనులకు పాల్పడితే ఎంతటివారినైనా సహించే ప్రసక్తే లేదన్నారు.

వేసవి తాపం తీర్చే 'కళింగర'


ఆర్‌అండ్‌బీ బంగ్లా వద్ద కళింగర కాయల విక్రయం

రాయదుర్గంటౌన్: ఫిబ్రవరి నుంచే సూర్యుడు మండుతున్న వేళ వేసవితాపం తీర్చే కూల్ కూల్...కూల్ కళింగర (పుచ్చకాయలు) మార్కెట్‌లోకి వచ్చేసింది. ఆకలిని, దప్పికను ఏకకాలంలో తీరుస్తానంటోంది. స్థానికంగా కళింగర కాయలు అందుబాటులోకి లేకపోవడంతో కర్ణాటక ప్రాంతం నుంచి కొనుగోలు చేసి పలువురు వ్యాపారులు పట్టణంలోని పలు ప్రాంతాల్లో విక్రయిస్తున్నారు. కళింగర కాయలో ఔషధగుణాలు ఎక్కువగా ఉంటాయని, వేసవిలో ప్రతిఒక్కరూ తప్పనసరిగా తినాలని వైద్యురాలు మాధవి సూచించారు. శరీరానికి అవసరమైన ఉష్ణోగ్రతను క్రమబద్ధీకరిస్తూ వడదెబ్బకు గురికాకుండా అమృతంలా పనిచేస్తుందన్నారు.

ఆయకట్టులో పెరిగిన ఆరుతడి సాగు

- వరికి బదులుగా మొక్కజొన్న, వేరుశనగ, పత్తిపై రైతుల ఆసక్తి
- నీటి ఆదాతో పాటు తగ్గనున్న పెట్టుబడులు


గోనబావి వద్ద ఆయకట్టులో సాగు చేసిన వేరుశనగ


కళకళలాడుతున్న మొక్కజొన్న పంట

రాయదుర్గం: బీటీపీ ఆయకట్టులో వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. వరికి బదులుగా మొక్కజొన్న, వేరుశనగ, పత్తి తదితర ఆరుతడి పంటల సాగు విస్తీర్ణం అనూహ్యంగా పుంజుకుంది. గతంలో అవగాహన సదస్సులు నిర్వహించి ఆయకట్టులో ఆరుతడే శ్రేయస్కారమని ఎంత నచ్చచెప్పిన రైతులు వినేవారు కాదు. ప్రస్తుతం మార్పు కనిపించింది. వరి కంటే మొక్కజొన్న, వేరుశనగ, పత్తి పంటలకు మార్కెట్లో డిమాండ్ పెరగడం, నీటి తడుల ఆదాతో పాటు పెట్టుబడులు తగ్గడం లాంటి కారణాలు వెరసి సులభతర వ్యవసాయంపై రైతులు దృష్టి సారించారు. రాయదుర్గం, కళ్యాణదుర్గం నియోజకవర్గాల్లోని గుమ్మఘట్ట, బ్రహ్మసముద్రం మండలాల్లో ఎడమ, కుడి ప్రధాన కాలువల ద్వారా 7,370 ఎకరాలకు నీటిని అధికారులు సమకూర్చారు. ఇందులో ఆరుతడి పంటలు కూడా ఆశించిన స్థాయిలో సాగులోకి వస్తుండడంతో నీటి డిమాండ్ తగ్గే అవకాశం ఉందని ఇరిగేషన్ అధికారులు భావిస్తున్నారు. వేరుశనగ 90–100 రోజులు, మొక్కజొన్న 120 రోజులు, నువ్వుల పంటైతే 80–100 రోజులు, పత్తి పంటైతే 120–150 రోజుల్లోపు చేతికొస్తుంది. వరి అయితే మరింత ఎక్కువ రోజుల సమయం తీసుకుంటుందని రైతుల తెలిపారు.

డిస్ట్రిబ్యూటర్ల వద్ద తగ్గని వివాదాలు..

ప్రధాన కాలువ నుంచి డిస్ట్రిబ్యూటరీ ద్వారా ఆయకట్టుకు నీరందించే పిల్ల కాలువలను పైభాగాన ఉన్న కొందరు రైతులు అవగాహన లోపంతో కబ్జాలకు పాల్పడుతున్నారు. లోకలైజేషన్ కలిగిన భూములకు నీటి వాటా హక్కుగా ఉన్నా, పునరుద్ధరణ విషయంలో అటకాయిస్తూ వివాదాలు రాజేస్తున్నారు. తమ పొలాల్లో కాలువలు తవ్వకుండా అడ్డుపడుతున్నారు. రెండు రోజుల క్రితం 12వ డిస్ట్రిబ్యూటరీ పరిధిలో ఇలాంటి ఘటనకు డిప్యూటీ తహసీల్దార్ నరేష్‌కుమార్, సర్పంచ్ కవిత రైతులకు సర్దిచెప్పి పరిష్కారం చూపారు. ఆయకట్టుకు ఏళ్ల తరబడి నీటి తడులు లేకపోవడంతో పిల్ల కాలువలను చదునుచేసి సాగులోకి తెచ్చారు. దీంతో వివాదాలకు కారణమౌతోంది.

సాగు విస్తీర్ణం పెరిగింది



బీటీపీ ఆయకట్టు లో ఈ ఏడాది ఆరుతడి పంట విస్తీర్ణం బాగా పెరిగింది. మెజార్టీ సాగు వరి ఉన్నా గతంతో పోల్చితే ఆరుతడి కూడా ఎక్కువ సాగులోకి వచ్చింది. నాణ్యమైన దిగుబడులు సాధించేలా రైతులకు అన్ని విధాలా సలహాలు, సూచనలు అందజేస్తాం. మొక్కజొన్న పంటను కత్తెర పురుగు ఆశించ కుండా ముందస్తుగా నివారణ చర్యలకు అవగాహన కల్పిస్తున్నాం.

– లక్ష్మానాయక్, ఏడీఏ, రాయదుర్గం

పిల్ల కాలువలను పూడ్చితే చర్యలు



నీటి వాటా హక్కుగా ఉండే ప్రతి ఎకరానికి నీరు చేరాల్సిందే. అలాకాకుండా పైభాగాన ఉండే రైతులు కాలువల కబ్జాలకు పాల్పడితే కఠిన చర్యలు చేపడతాం. రైతులంతా సమన్వయంగా ఉంటూ నీటి తడులు సద్వినియోగం చేసుకోవాలి. పిల్ల కాలువలను పూడ్చివేత ప్రక్రియ మంచి పద్ధతికాదు. అందరూ అలా అనుకుంటే నీరెలా వస్తాయో అర్థం చేసుకోవాలి.

– వెంకటరమణ, డీఈ, రాయదుర్గం

జనసంద్రంగా బూదిగుమ్మ తిరునాల


ఆంజనేయస్వామికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం


ఉత్సవాల్లో పాల్గొన్న భక్త జనం

బొకుగుప్ప: మండలంలోని బూదిగుమ్మలో రథోత్సవంలో భాగంగా ఆదివారం ఆంజనేయస్వామి తిరునాలకు వేలాది మంది భక్తులు తరలివచ్చారు. ఆలయ సమీపంలోని పెన్నానది, జీడిపల్లి రిజర్వాయర్‌లో భక్తులు గంగపూజ అనంతరం స్వామిని దర్శించుకున్నారు. ఎంపీపీల సంఘం జిల్లా అధ్యక్షులు పెద్దన్న తదితరులు ఆంజనేయస్వామి, పద్మావతి వేంకటరమణస్వామినిదర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దాతలు బళ్లారి వెన్నపూస వంశ కుటుంబసభ్యులు, కుమ్మతి త్రిలోక్‌రెడ్డి, జెడ్పీటీసీ మమత దంపతులు, జీమానింటి కేశవరెడ్డి సహకారంతో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు రెండు రోజుల పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

పోటాపోటీగా భజన కార్యక్రమం..

శనివారం రాత్రి నిర్వహించిన భజన పోటీలు ఆకట్టుకున్నాయి. మొత్తం పది భజన బృందాలు పాల్గొనగా మొదటి స్థానంలో వేల్పుమడుగు బృందం నిలువగా ఎం.ఎం. హల్లి, వంకరాజు కాలువ, హనకనహాళ్, నక్కలపల్లి-1, నక్కలపల్లి-2 బృందాలు వరుసగా ఆరు స్థానాల్లో నిలిచారు. వారికి ప్రోత్సాహక బహుమతులుగా రూ.10,000, రూ.8,000, రూ.6,000 రూ.4,000, రూ.3000, రూ.2000 చొప్పున కమిటీ సభ్యులు దాతలు కలసి అందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్లు తిమ్మారెడ్డి, ఈశ్వరమ్మ, సర్పంచ్ రామకృష్ణమ్మ, ఎంపీటీసీ వీరబొమ్మన్న, భజన పోటీల నిర్వాహకులు, అభివృద్ధి కమిటీ సభ్యులు త్రిలోక్‌రెడ్డి, జయన్నస్వామి, రామచంద్రారెడ్డి, ఈశ్వరప్ప, వెంకటేశ్వర్లు, నరసింహప్ప, గోవింద రెడ్డి, జయరామిరెడ్డి, కేశవరెడ్డి, దొణతిమ్మారెడ్డి, చెన్నకేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లోకేశ్ పాదయాత్రతో టీడీపీ పని ఖాళీ


మాట్లాడుతున మంత్రి ఉషశ్రీచరణ్

కళ్యాణదుర్గం: టీడీపీ నాయకుడు లోకేశ్ పాదయాత్రతో తెలుగుదేశం పార్టీ పని అయిపోయిందని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ అన్నారు. ఆదివారం ఆమె 'సాక్షి' మీడియాతో ఫోన్‌లో మాట్లాడారు. లోకేశ్ చేస్తున్న పాదయాత్రకు ప్రజా స్పందన కరువైందన్నారు. కనీసం నిర్దేశించుకున్న కిలోమీటర్లు కూడా నడవలేక పోతున్నారని విమర్శించారు. పాదయాత్రకు జనం కరువవడంతో చంద్రబాబుతో పాటు పార్టీ నాయకులు నానా అవస్థలు పడుతున్నారని ఎద్దేవా చేశారు. పాదయాత్రకు ప్రజలు రాకపోతే పరిస్థితి ఇబ్బందికరంగా ఉంటుందని, రాష్ట్ర వ్యాప్తంగా ఆయా నియోజకవర్గాల నుంచి నాయకులు, కార్యకర్తలు పాల్గొనేలా తిప్పలు పడుతున్నారని దుయ్యబట్టారు. ప్రజా నాయకుడు పాదయాత్ర చేస్తే ప్రజలు స్వచ్ఛందంగా వస్తారన్నారు. బలవంతంగా రాజకీయ లబ్ధి కోసం, పదవుల కోసం పాదయాత్ర చేస్తే ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీని ఎదురించే శక్తి ఏ పార్టీకి లేదన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపడుతున్న సంక్షేమ పథకాలే మరోసారి రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీని అధికారంలోకి వచ్చేలా చేస్తాయన్నారు. నవరత్న పథకాలు అందుకున్న ప్రతి ఒక్కరూ వైఎస్సార్‌సీపీ వైపు ఉన్నారన్నారు. రాష్ట్రంలో చంద్రబాబు, లోకేశ్, జనసేన ఏకమై వచ్చినా వైఎస్సార్‌సీపీకి ఒరిగేదేమీలేదని స్పష్టం చేశారు. ఎంతమంది పగటి వేషగాళ్లు వచ్చినా రాష్ట్రంలో మరోసారి వైఎస్సార్‌సీపీ జెండా ఎగురుతుందన్నారు.


ఫలించిన మాజీ ఎమ్మెల్యే కృషి


వజ్రకరూరు నుంచి విడపనకల్లుకు వెళ్లే తారురోడ్డు నిర్మాణ పనులు చేపట్టిన దృశ్యం

వజ్రకరూరు: వజ్రకరూరు నుంచి పొట్టిపాడు, చాబాల, ధర్మపురి, జనార్దనపల్లి తదితర గ్రామాల మీదుగా విడపనకల్లుకు వెళ్లె ప్రధాన రహదారి పనులు చురుగ్గా సాగుతున్నాయి. నూతన రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం రూ.3 కోట్లు మంజూరు చేసింది. గతంలో రోడ్డు దెబ్బతిని రాళ్లు పైకి తేలి సుమారు 10 గ్రామాల ప్రజలు వజ్రకరూరుకు రాకపోకలు సాగించేందుకు అవస్థలు పడేవారు. ఈ నేపథ్యంలో ఆయా గ్రామాల ప్రజలు ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి దృష్టికి తీసుకు వెళ్లారు. స్పందించిన ఆయన వెంటనే ప్రభుత్వం, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి నిధులు మంజూరు చేయించడంతో తారు రోడ్డు నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. దీంతో ఆయా గ్రామాల ప్రజలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. తారురోడ్డు పనులు పూర్తయితే ప్రయాణానికి అనువుగా ఉంటుందని పొట్టిపాడు, చాబాల, ధర్మపురి, చిన్నహోతూరు, గడేహోతూరు, ఛాయాపురం, జనార్దనపల్లి తదితర గ్రామాల ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు.

శివరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభం


అలంకరణలో స్వామి


కోనేరులో గంగపూజ చేస్తున్న రాష్ట్ర డైరెక్టర్ బాబురెడ్డి

కంబదూరు: ప్రసిద్ధిగాంచిన మల్లీశ్వరస్వామి స్వామి శివ పంచాక్షరి శివరాత్రి బ్రహ్మోత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం స్వామిని ప్రత్యేకంగా పూలతో అలంకరించి పూజలు నిర్వహించారు. తర్వాత పురాతన కోనేరు బావిలో రాష్ట్ర జానపద, సృజనాత్మక అకాడమీ డైరెక్టర్ బాబు రెడ్డి గంగపూజ చేశారు. అలాగే సర్పంచ్ పద్మావతమ్మ, తిమ్మప్ప దంపతులు అఖండజ్యోతి వెలిగించారు. అంతకుముందు ఊరి బావిలో బెస్త కులస్తుల చేత గంగపూజ చేపట్టారు. వారం రోజుల పాటు బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తారు. చుట్టుపక్కల ప్రాంతాల నుంచే కాకుండా ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక ప్రాంతాల నుంచి కూడా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పూజలు చేస్తారు.

బూదగవి గంగమ్మకు ప్రత్యేక పూజలు


ఉరవకొండ: అలంకరణలో బూదగవి గంగమ్మ

ఉరవకొండ: మండలంలోని బూదగవి చెరువు కట్ట వద్ద ఉన్న జగనన్న లేఅవుట్స్ సమీపంలో శివగంగ కాలనీలో గంగమ్మ తల్లి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. మాఘ మాసం నాలుగో ఆదివారం పురస్కరించుకుని ఉదయం అమ్మవారికి సుప్రభాతం, మహా మంగళహారతి, కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం అమ్మవారి పల్లకీ ఉత్సవం చేపట్టారు. కార్యక్రమంలో ఆలయకమిటీ సభ్యుడు చిన్నా, భక్తులు పాల్గొన్నారు.

వజ్రకరూరు: మండలంలోని వివిధ గ్రామాల్లోని శివాలయాల్లో ఆదివారం మాఘమాస పూజలు ఘనంగా నిర్వహించారు. వజ్రకరూరులోని భోగేశ్వరస్వామి, నగరేశ్వరస్వామి, రామేశ్వరస్వామి, నీలగిరిస్వామి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. జరుట్లరాంపురం గ్రామంలోని జరుట్ల రామలింగేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేపట్టారు.




వజ్రకరూరు: పూజలందుకుంటున్న భోగేశ్వరస్వామి, జరుట్ల రామలింగేశ్వరస్వామి, నీలగిరిస్వామి

చెక్ డ్యాం నిర్మాణ పనులు ప్రారంభం


పనులు ప్రారంభిస్తున్న ఆర్డీటీ ఎకాలజీ డైరెక్టర్ నాగేశ్వరరెడ్డి తదితరులు

కుందుర్పి: మండలంలోని కొలిమిపాళ్యం, జంబుగుంపల గ్రామాలను కలుపుతూ రూ.60 లక్షలతో చెక్‌డ్యాంల నిర్మాణ పనులను ఆర్డీటీ ఎకాలజీ సిబ్బంది ఆదివారం ప్రారంభించారు. రెండు నెలల్లో చెక్‌డ్యాంల పనులు పూర్తి చేయనున్నట్లు ఎకాలజీ డైరెక్టర్ నాగేశ్వర్‌రెడ్డి తెలిపారు. అలాగే ఏప్రిల్ నుంచి జంబుగుంపల పంచాయతీలోని ఐదు గ్రామాల్లో రూ.12 కోట్లతో అభివృద్ధి పనులు చేపడతామన్నారు. ఇప్పటికే గ్రామాల్లో సర్వే నిర్వహించి పొలాల్లో చేపట్టాల్సిన పనులపై రైతుల నుంచి అనుమతి తీసుకున్నామన్నారు. పండ్లతోటల పెంపకం, నీటి కుంటల నిర్మాణాలు, పాడిపరిశ్రమ, భూఅభివృద్ధి పనులు, కుంటకట్టల నిర్మాణం తదితర అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కమలమ్మ, సర్పంచ్ గంగాధర, ఎస్‌టీఎల్‌లు హనుమంతరాయుడు, రామాంజనేయులు, టెక్నికల్ డైరెక్టర్ విజయభాస్కర్‌రెడ్డి, ఎస్టీఎల్ రామకృష్ణ, రైతులు పాల్గొన్నారు.

గుండెపోటుతో డ్రైవర్ మృతి


తిప్పయ్య (ఫైల్)

బొకుగుప్ప: మండలంలోని దుద్దేకుంటకు చెందిన హరిజన తిప్పయ్య(49) ఆదివారం బొలెరో లగేజీ వాహనం నడుపుతూ గుండెపోటుకు గురై మృతి చెందాడు. గ్రామస్తుల సమాచారం మేరకు.. బొలెరో వాహనంతో జీవనం సాగించే అతడు బాడుగ కోసం సమీప గ్రామం కోనంపల్లికి వెళ్తుండగా గుండెపోటు రావడంతో.. వాహనాన్ని రహదారి పక్కనే నిలిపాడు. గ్రామస్తులు వెళ్లి చూసేసరికి అప్పటికే మృతి చెంది ఉన్నాడు. అతడికి భార్య దురగమ్మ, కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. యజమాని మృతి ఆ కుటుంబంలో తీవ్ర విషాదాన్ని నింపింది.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


అప్పటి గురువులతో పూర్వ విద్యార్థులు

కణేకల్లు: కణేకల్లుక్రాస్‌లోని గురుకుల పాఠశాలలో ఆదివారం 2005–06 పదో తరగతి విద్యార్థుల సమ్మేళనం ఆద్యంతం ఉత్సాహంగా... ఉల్లాసంగా సాగింది. ఈ బ్యాచ్‌కు చెందిన వారిలో నలుగురు డాక్టర్లు... మరి కొందరు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు, ఇంకా కొందరు సచివాలయ ఉద్యోగులు, ప్రైవేటు కంపెనీలో ఉద్యోగాలు చేస్తూ వేర్వేరు ప్రాంతాల్లో స్థిరపడ్డారు. మొత్తం 80 మంది విద్యార్థుల్లో 20 మంది ప్రభుత్వ ఉద్యోగులుగా పని చేస్తుండగా... మరో 30 మంది వరకూ ప్రైవేటు కంపెనీల్లో పని చేస్తున్నారు. అందరూ పాఠశాల వేదికగా కలిసి పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం అప్పటి గురువులను సత్కరించారు.

దశభుజ మహా గణపతికి పూజలు



రాయదుర్గంటౌన్: పట్టణంలోని ఆత్మకూరు వీధిలో వెలసిన దశభుజ మహాగణపతికి ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. స్థానికులే కాకుండా కర్ణాటక నుంచి కూడా అధిక సంఖ్యలో భక్తులు హాజరై మొక్కులు తీర్చుకున్నారు.

ఘనంగా ధ్వజ స్తంభ ప్రతిష్ట


ధ్వజ స్తంభం ప్రతిష్టిస్తున్న దృశ్యం

బ్రహ్మసముద్రం: మండలంలోని గుండిగానిపల్లి శివాలయం ఎదుట ఆదివారం ధ్వజ స్తంభ ప్రతిష్ట కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. రెండు రోజులు నుంచి ఆలయంలో గంగపూజ, గోపూజ, గణపతి హోమం, నవగ్రహ పూజ, రుద్రహోమం, మహా మంగళహారతి, విశేష పూజా కార్యక్రమాలు చేపట్టారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఆంజనేయుడి విగ్రహ ప్రతిష్ట

కూడేరు: మండలంలోని జయపురంలో ఆదివారం ఆంజనేయస్వామి విగ్రహం, ధ్వజ స్తంభ ప్రతిష్ట ఘనంగా నిర్వహించారు. ప్రతిష్ట అనంతరం వేదపండితులు ఆంజనేయుడి మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు చేపట్టి భక్తులకు దర్శనం కల్పించారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి ప్రణయ్ కుమార్ రెడ్డి విచ్చేసి ప్రత్యేక పూజలు చేయించారు. ఎంపీపీ నారాయణరెడ్డి, వైస్ ఎంపీపీ దేవా, ఎంపీటీసీ సభ్యుడు నాగభూషణం, వైఎస్సార్ సీపీ నేతలు తుప్పటి హరీష్, బైరెడ్డి రామచంద్రారెడ్డి, ఎర్రిస్వామి దేవేంద్ర, గంగాధర్, వడ్డే గంగాధర్, ఆదినారాయణ పాల్గొన్నారు.

19న చితంబరస్వామి రథోత్సవం

కూడేరు: మండలంలోని మరుట్ల-3వ కాలనీలో ఈ నెల 19న సాయంత్రం 6 గంటలకు చితంబర స్వామి రథోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు, గ్రామపెద్దలు ఆదివారం తెలిపారు. రథోత్సవ సందర్భంగా రాతిదూలం లాగుడు పోటీలు ఏర్పాటు చేశామన్నారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి రథోత్సవం విజయవంతం చేయాలన్నారు.

శివపార్వతుల ప్రతిష్ట


శివపార్వతులు, తగ్గుపర్తమ్మ దేవి విగ్రహాలు

బొకుగుప్ప: మండలంలోని తగ్గుపర్తి శివాలయంలో ఆదివారం శివపార్వతులు, తగ్గుపర్తమ్మ దేవీ ఉత్సవ విగ్రహమూర్తుల చర ప్రతిష్ట నిర్వహించారు. మూడు రోజులుగా ఆలయంలో వేదపండితులు ప్రతిష్ట పూజలు, హోమాలు చేపట్టారు. ప్రతిష్ట అనంతరం చండీ హోమం, పూర్ణాహుతి హోమాలు, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఇన్‌చార్జ్ బాధ్యతలు మాకొద్దు

కూడేరు: సెలవులోనైనా వెళతాంగాని ఇన్‌చార్జ్ వీఆర్వో బాధ్యతలు మాకొద్దంటున్నారు తహసీల్దార్ కార్యాలయంలో పని చేసే సిబ్బంది. చోళసముద్రం వీ ఆర్వో సురేంద్ర, కొర్రకోడు వీఆర్వో నాగరాజు కొన్ని నెలల క్రితం సస్పెండయ్యారు. దీంతో చోళసముద్రానికి తిమ్మాపురం వీఆర్వో నరసయ్యకు, కొర్రకోడుకు ఉదిరిపికొండ వీఆర్వో లక్ష్మన్నకు ఇన్‌చార్జ్‌లుగా ఇచ్చారు. పనిభారంతో వారు ఇన్‌చార్జ్ విధులు నిర్వర్తించడానికి ఇబ్బందులు పడుతున్నారు. నెల క్రితం మరుట్ల, కలగళ్ల వీఆర్వో జానకిరామయ్య ఒత్తిళ్లు తట్టుకోలేక మెడికల్ లీవ్‌పై వెళ్లారు. దీంతో కూడేరు వీఆర్వో సేతుమాధవ్‌కు ఇన్‌చార్జ్ బాధ్యతలను అప్పగించగా తాను చేయలేనని చెప్పుకొచ్చాడు. ప్రధానంతో కార్యాలయంలో ఓ ద్వితీయ స్థాయి అధికారి పెత్తనం, ఆధిపత్య పోరుతో సిబ్బంది మూకుమ్మడిగా సెలవుల్లోకి వెళ్లడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది.

వ్యక్తికి గాయాలు

బొకుగుప్ప: మండలంలోని కాలువపల్లి సమీపంలో ఉన్న పెన్నానది వంతెనపై ఆదివారం రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్నాయి. ప్రమాదంలో కళ్యాణదుర్గం నుంచి అనంతపురం వెళ్తున్న రామచంద్ర అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. అతడిని 108లో ఆత్మకూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.